# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 13-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఫ్రాన్స్, స్లోవేకియా దేశాలలో పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి ఈరోజు బయలుదేరి వెళ్లారు.
- గ్రామీణ భారత వికాసంతోనే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.
- మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఉపాధి కల్పనకు కూడా రవాణా శాఖ ప్రాధాన్యతనిస్తోందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.
- దేశంలో "ఒక దేశం.. ఒకే ఎన్నిక.." విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తెలిపారు.

=====================

ఫ్రాన్స్, స్లో వేకియా దేశాలలో పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి ఈరోజు బయలుదేరి వెళ్ళారు. ఈ పర్యటనలో భాగంగా మొదటిగా ప్రధానమంత్రి ఫ్రాన్స్‌లోని నీస్ నగరాన్ని సందర్శించి అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ తో సమావేశం కానున్నారు. తన పర్యటనకు ముందు విడుదల చేసిన ప్రకటనలో నరేంద్ర మోదీ.. ఫ్రాన్స్ - భారత్ దేశాల మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడినట్లు తెలిపారు. రేపు ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఫ్రాన్స్ అధ్యక్షుడుతో కలిసి "భారత్ ఇన్నోవేట్స్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లుగా ప్రధాని చెప్పారు. అదే విధంగా భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంపై చర్చలు మరింత వేగం పుంజుకోనున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. స్లోవేకియా పర్యటన అనంతరం నరేంద్ర మోదీ ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనున్నారు.

=====================

గ్రామీణ భారత వికాసంతోనే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. `వికసిత్ భారత్-2047 కోసం సుస్థిర వ్యవసాయం సాంకేతికత అనుసంధానంతో స్పష్టమైన ఫలితాలు` అనే అంశంపై న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ సదస్సును ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓం బిర్లా ప్రసంగిస్తూ... సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక సాంకేతికతతో మేళవించడం ద్వారానే ప్రపంచ వ్యవసాయ రంగానికి నాయకత్వం వహించే స్థాయికి భారతదేశం ఎదగగలదని అన్నారు. దేశంలో వ్యవసాయం కేవలం ఒక ఆర్థిక రంగం మాత్రమే కాదని సంస్కృతి, నాగరికత, జీవన విధానంలో అంతర్భాగమని ఓం బిర్లా పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో "ఒక దేశం.. ఒకే ఎన్నిక.." విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ తెలిపారు. పుదుచ్చేరిలో విలేకరులతో ఈ రోజు మాట్లాడిన ఆయన.. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా మానవ వనరులు ఇతర వనరుల వినియోగం మరింత సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన ప్రస్తావిస్తూ.. ఈ మధ్య కాలంలో దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటకు వచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని, 5 లక్షలకు పైగా గ్రామాల్లో బహిరంగ మలవిసర్జన రహిత స్థితిని సాధించామని కేంద్ర మంత్రి తెలిపారు. అలాగే, మౌలిక సదుపాయాల కల్పన కోసం భారత్ కేటాయించే నిధులు 2 లక్షల కోట్ల రూపాయల నుండి 12.2 లక్షల కోట్ల రూపాయలకు పెరిగాయని మురుగన్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తన పర్యటనలో భాగంగా, మురుగన్ పుదుచ్చేరి రైల్వే స్టేషన్ పనితీరును పరిశీలించడంతో పాటు, అక్కడ జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఉపాధి కల్పనకు కూడా రవాణా శాఖ ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. నాగపూర్‌లో ఈరోజు విలేకరులతో ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రక్రియను రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ ప్రారంభించిందని చెప్పారు. 2025 జనవరిలో ప్రకటించిన విధానం ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం 1,600 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారని అన్నారు. వీటిలో ఇప్పటికే 24 కేంద్రాలు పని చేస్తుండగా, మరో 112 కేంద్రాలు ఏర్పాటు దశలో ఉన్నాయని, ఇప్పటివరకు సుమారు 10 లక్షల మంది ఈ కేంద్రాల ద్వారా శిక్షణ పొందారని కేంద్రమంత్రి వివరించారు. ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయడం ప్రారంభించిన తర్వాత.. ఏటా సుమారు 1.15 కోట్ల మంది డ్రైవింగ్ శిక్షణ పొందుతారని, తద్వారా గణనీయమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని నితిన్ గడ్కరీ చెప్పారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

అసోంలోని జోర్హాట్ వైమానిక స్థావరం సమీపంలో భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఈరోజు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు సిబ్బంది మృతి చెందడం పట్ల భారత వైమానిక దళం (ఐఏఎఫ్) తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా ఈ విమాన ప్రమాదం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభం కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్ యు ఖేమరం కుమావత్ అగ్నివీర్ యూ డానిష్ ఆలం విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారని సామాజిక మాధ్యమం పోస్ట్‌లో తెలిపారు. దేశానికి వారు అందించిన ధైర్యం, సేవను ఎల్లప్పుడూ గర్వంగా, కృతజ్ఞతతో గుర్తుంచుకుంటామని ఆయన అన్నారు. ఈ విషాద సమయంలో దేశం వారికి అండగా నిలుస్తుందని రాజ్ నాథ్ సింగ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా తెలిపారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా సిమ్లాలో ఈ రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... 2024-25 ఆర్థిక సంవత్సరంలో హిమాచల్ ప్రదేశ్ ప్రత్యేక సహాయ పథకం కింద 2 వేల 381 కోట్ల రూపాయలు, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి ద్వారా 2 వేల 006 కోట్ల రూపాయలు, బాహ్య సహాయ ప్రాజెక్టుల కోసం 2 వేల 150 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. రాష్ట్రంలో 40 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులు, రికార్డు స్థాయిలో 2 వేల 911 కోట్ల రూపాయల కేటాయింపులతో కూడిన రైల్వే ప్రాజెక్టులు ప్రస్తుతం అమలులో ఉన్నాయని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, జార్ఖండ్, బీహార్‌లోని మరికొన్ని ప్రాంతాలలో నైరుతి రుతుపవనాలు విస్తరించడానికి అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎమ్‌డి) ఈ రోజు తెలిపింది. అరుణాచల్ ప్రదేశ్, బీహార్, కేరళం, మాహే, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కింలోని కొన్ని ప్రాంతాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసినట్లు ఐఎండీ శాస్త్రవేత్త అమిత్ కుమార్ తెలియజేస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాల స్టేడియం వేదికగా భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఈరోజు ప్రారంభమైన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ బ్యాటింగ్ ముగిసింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్థాన్ 194 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సులు కొట్టి 102 పరుగులతో రాణించాడు. భారత బౌలర్లలో గురునూర్ బ్రార్, హర్షదూబే ఆరంగ్రేటరంలోనే చెరో 3 వికెట్లు తీసి అఫ్గానిస్థాన్ ను 194 పరుగులకే కట్టడి చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =